

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**"సారీ. లేటైంది"** అనీష్ అన్నాడు.

"ఫరవాలేదు" బదులిచ్చాను.

"సో నువ్వు ఏరోస్పేస్‌లో మాస్టర్స్‌కి వచ్చావన్నమాట" అన్నాడు.

"తెలిస్తే ఎందుకడుగుతున్నావు?" హనీష ఎగతాళి చేసింది.

కన్వర్ సేషన్ స్టార్ట్ చేస్తున్న హనీష. "అందరూ నీలా ఉండరు కదా"

నా వంక చూసాడు.

"ఔను" బదులిచ్చాను.

"ఏరో స్పేస్ ఎందుకు తీసుకున్నావు?" అడిగాడు.

"ఇష్టం" చెప్పాను.

"ఎందుకు తీసుకుంటే నీకేంటి? ఇదేమైనా జాబ్ ఇంటర్వ్యూనా" హనీష కసురుకుంది.

"హనీష, ప్లీజ్" అని, "ఎందుకు ఇష్టం?" నన్ను అడిగాడు.

"ఇట్స్ ఇంట్రెస్టింగ్" చిరాకు పడ్డాను. ఆ తరువాత హనీషవైపు కోపంగా చూసాను.

"ఏం ఇంట్రెస్ట్?" అడిగాడు.

బదులివ్వకుండా టేబుల్‌ని చూసాను.

"ఫ్లైట్ మెకానిక్సా, లేక ఏరో డైనమిక్సా? లేక వేరే ఏదైనా ఎక్కువ ఇష్టమా?" అడిగాడు.

"హైపర్ సోనిక్ ఏరో డైనమిక్స్" హనీషని చూస్తూ బదులిచ్చాను.

"అయితే నువ్వు ఫస్ట్ సెమిస్టర్‌లో ఏరో స్పేస్ ప్రొపల్షన్, కంప్యుటేషనల్ ఫ్లూయిడ్ మెకానిక్స్ కంపల్సరీ తీసుకో" అన్నాడు.

"ఫ్లూయిడ్ మెకానిక్స్ ఇంజనీరింగ్‌లో చదివేసాను."

"కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ మెకానిక్స్ వేరు. మనకి చెప్పింది చాలా బేసిక్. కంప్యూటేషనల్‌లో నీకు మేట్ లేబ్ వాడ్డం నేర్పిస్తారు. చాలా కోర్సెస్‌కి అది చాలా ఇంపార్టెంట్. కంపల్సరీ తీసుకో. చాలామంది అది వెయివ్ చేసారు కానీ తర్వాత చాలా కష్టపడ్డారు."

"ఓ ఓకే" తను అడిగిన ప్రశ్నలు వృధాకాదని అర్థమైంది.

"నీ అడ్వైసర్ ఎవరు?"

"తెలీదు"

"డాక్టర్ ఆల్ట్‌మన్ అయితే ఓకే. డాక్టర్ విట్‌మన్ అయితే అంతే సంగతులు"

"ఎందుకు?"

"డాక్టర్ విట్‌మన్ పెద్ద సాడిస్ట్. అన్ని డిఫికల్ట్ కోర్సులు అవసరం లేకపోయినా తీసుకోమంటాడు. ఆయన దగ్గర థీసిస్ చేస్తే అదో పెద్ద వలయం. ఒక పట్టాన ఒప్పుకోడు. అన్నిటిల్లో వంకలు పెడతాడు. రిసల్ట్స్ బావున్నా ఎక్స్‌పరిమెంట్స్ మళ్ళీ మళ్ళీ చేయిస్తాడు. ఆయన మొహంలో ఎక్స్‌ప్రెషన్స్ ఉండవు. కోపంగా ఉన్న ఆనందంగా ఉన్నా ఒకే ఎక్స్‌ప్రెషన్. కానీ చాలా నాలెడ్జ్ ఉంది ఆయనకి" అన్నాడు.

"ఔనా?" బెదిరిపోయాను.

"ఆన్ బ్రైట్ సైడ్, ఆయన దగ్గర పని చేసి గ్రాడ్యుయేట్ అయితే జాబ్ గారెంటీ" ధైర్యం చెప్పాడు.

"విట్‌మన్ పెద్ద రాక్షసుడు. ఒకతను మూడేళ్ళనుండి థీసిస్ మీదపని చేస్తూనే వున్నాడు. అసలు ఈ జన్మలో గ్రాడ్యుయేట్ అవుతాడా అని మాఅందరికీ డౌట్. ఇంకో అతనైతే ఏకంగా డిపార్ట్‌మెంట్ మారి ఎలెక్ట్రికల్‌కి వెళ్ళిపోయాడు" హనీష చెప్పింది.

"పర్లేదులే. అడ్వైసర్‌ని మార్చచ్చు. నీకు ఎవరో ముందు తెలుసుకుని చెప్పు. విట్‌మన్ అయితే నా అడ్వైసర్‌కి నిన్ను రికమెండ్ చేస్తాను. ఆయన చాలా మంచివారు. డెఫినెట్లీ హెల్ప్ చేస్తారు" నేను భయపడడం గమనించి అన్నాడు.

హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుని "థాంక్స్" అన్నాను.

"ఫస్ట్ సెమిస్టర్ ఫైవ్ హండ్రెడ్ లెవెల్ కోర్సులు తీసుకో. సెవెన్ హండ్రెడ్ అస్సలు తీసుకోకు. చాలా కష్టం అవి. ఫోర్ హండ్రెడ్ అంటే అండర్ గ్రాడ్యుయేట్ లెవెల్ కోర్స్. అవి తేలిక."

"ఓకే"

"నువు రిజిష్టర్ అయ్యే ముందు ఏం తీసుకుంటున్నావో నాకు చెప్పు. అయినా నీ అడ్వైజర్ గైడ్ చేస్తారు లే" అన్నాడు.

"విట్‌మన్ తప్ప" హనీష అంది.

"టెన్షన్ పడకు. మేము హెల్ప్ చేస్తాములే" అనీష్ ధైర్యం చెప్పాడు.

"ఓకే. థాంక్స్"

"ఓకే మరి. నేను వెళ్ళి జాబ్ చేస్తా ఇంక. బాయ్" అన్నాడు.

ఇద్దరం థాంక్స్ చెప్పి నడవడం మొదలు పెట్టాము.

"విట్‌మన్ నిజంగా అంత స్ట్రిక్టా?" హనీషని అడిగాను.

"చాలా. చండసాసనుడు. అస్సలు మంచి వాడుకాదు. ఇండియన్ స్టూడెంట్స్ అంటే ఆయనకి అస్సలు ఇష్టంలేదు. ఇక్కడి వాళ్ళతో బానేవుంటాడు. మనని చూడగానే మొహం మార్చేస్తాడు" అంది.

ఆశ్చర్యపోయాను.

"ఐస్క్రీం తింటావా?" అడిగింది.

"యా తింటాను" అటువైపుగా నడిచాం.

"నీకు ఏ ఫ్లేవర్ ఇష్టం?" అడిగింది.

"చాక్లెట్"

"వైల్డ్ చెర్రీ తిన్నావా?"

"లేదు."

"బావుంటుంది. ట్రై చెయ్యి. ఎక్కువ స్వీట్ ఉండదు. ఇక్కడ మిగిలినవి అన్నీ చాలా స్వీట్ ఉంటాయి" అంది.

"సరే. ట్రై చేస్తా" అన్నాను.

ఛలో ఐస్క్రీం తీసుకుని బయటకి నడిచాము.

"ఇక్కడ ఐస్క్రీమ్స్ చాలా రకాలు ఉంటాయి. కానీ కేక్స్ అన్ని ఎక్కువ వెరైటీలు ఉండవు. ఐస్క్రీమ్స్ ఇక్కడ బావుంటాయి. కేక్స్ ఇండియాలో బావుంటాయి. ఇక్కడ అన్నిట్లో కార్న్ సిరప్ వేస్తారు. చాలా షుగర్ వేస్తారు. తీపి తప్ప వేరే రుచి తెలీదు. ఫ్లేవర్ అసలు చెప్పలేం. అన్నిటిమీద కొండంత ఫ్రాస్టింగ్ వేస్తారు. అది తినేసరికే గొంతు తిక్క పుడుతుంది."

"ఔనా, నేను ఇక్కడ ఎక్కువ వెరైటీలు ఉంటాయనుకున్నాను."

"మనవే బావుంటాయి. మనకి దొరికే పైన్ ఆపిల్ కేక్ గుర్తుందా?"

"యా. నాకు ఇష్టం. నా ఫేవరెట్"

"నాక్కూడా. ఇక్కడ అలాంటిది అసలు దొరకనే లేదు తెలుసా? క్లోసెస్ట్ ఉన్నది. పైనాపిల్ అప్ సైడ్ డౌన్‌కేక్. కానీ మనదానంత రుచి ఉండదు."

"ఓ. ఇక్కడ ఏది బావుంటుంది?"

"పైనాపిల్ అప్ సైడ్ డౌన్ బావుంటుంది. బ్లాక్‌ఫారెస్ట్ బావుంటుంది. మిగిలినవి అతి తీపి."

"ఓ.ఓకే."

"కొన్నిట్లో బేకన్ ఉంటుంది. చూసుకోవాలి"

నవ్వాను.

"జోక్ కాదు. నిజంగానే. నాన్ వెజ్ ఉంటుంది"

"అదేంటి? కేక్‌లు, ఐస్క్రీంలో నాన్ వెజ్జా?"

"ఔను. అన్నీ చెక్ చేసుకోవాలి లేబుల్స్‌ని. ఒకసారి నేను వెజిటేరియన్ సూప్ ఆర్డర్ చేస్తే అందులో చికెన్ ఉంది. ఇదేంటి అని అడిగితే వెజిటబుల్స్ విత్ చికెన్ అని చెప్పారు. టేస్ట్ బానే ఉందనుకో" అంది. ఇంతలో ఇల్లు చేరాము. అప్పుడు గుర్తొచ్చింది తాళం వెయ్యలేదని.

"అయ్యో మనం లాక్ చెయ్యలేదు" దాదాపు అరిచాను.

పెద్దగా నవ్వు "ఏంకాదు, కావాలనే లాక్ వెయ్యలేదు. నేను క్లాస్ ఉంటే తప్ప వెయ్యను. ఇక్కడ అందరూ మనవాళ్ళే ఉంటారు. దొంగలు రారు" అంతే.

లోపలికి వెళ్ళాక తను ఎవరితోనో ఫోన్ మాట్లాడింది. ఈలోపు నేను అన్నయ్యకి మెసేజ్ చేసి విట్‌మన్ గురించి చెప్పాను. భయంగా ఉంది, ఏం చెయ్యాలి? అని అడిగాను.

'ఎంతమందితో మాట్లాడావు' అని అడిగాడు.

ఇద్దరితో అని చెప్పాను.

'ఇద్దరేగా?' అన్నాడు.

ఒళ్ళు మండిపోయింది. రిప్లై ఇవ్వలేదు.

రెండు గంటల్లో ఫోన్ చేస్తానని చెప్పాడు.

సరే అని ఇన్స్టాగ్రామ్ ఓపెన్ చేసి అందులో నా ఫ్రెండ్స్ పెట్టిన ఫోటోలు చూస్తూ కాలక్షేపం చేసాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story